ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
శనివారం 1 ఫిబ్రవరి 2025





ఆదిత్యుడు.. 'వెలుగుల'రేడు

రథసప్తమి ఉత్సవాల వేళ ఆదిత్యుడు.. 'వెలుగుల'రేడుగా ధగధగలాడుతున్నాడు. రథసప్తమిని ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించిన నేపథ్యంలో ఈ నెల 2, 3, 4 తేదీల్లో ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆదిత్యుడి ఆలయ ప్రాంగణంతోపాటు.. శ్రీకాకుళం, అరసవల్లిలో ప్రధాన జంక్షన్లను విద్యుత్ కాంతులతో అలంకరించారు.

రథసప్తమి వేడుకలకు ఏర్పాట్లు

- తొలిసారిగా హెలీకాప్టర్ టూరిజం
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మూడు రోజులపాటు రథసప్తమి వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నట్టు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ఉత్సవాల ఏర్పాట్లపై శుక్రవారం కలెక్టరేట్‌లో అధికారులతో ఆయన సమావేశమయ్యారు. శోభాయాత్ర, సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో వైభవంగా ఉత్సవాలను నిర్వహించడానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. '2న ఉదయం స్థానిక 80 అడుగుల రోడ్డు వద్ద సామూహిక సూర్యనమస్కారాలతో వేడుకలు ప్రారంభమవుతాయి. మునిసిపల్ మైదానంలో వాలీబాల్, కర్రసాము, సంగిడీలు, ఎద్దుల బండ్ల పోటీలు, వెయిట్ లిఫ్టింగ్ వంటి గ్రామీణ క్రీడల పోటీలు జరుగుతాయి. డచ్ బిల్డింగ్ వద్ద క్రాకర్స్ షో ఉంటుంది. తొలిసారిగా హెలీకాప్టర్ టూరిజం అందుబాటులోకి తెచ్చాం. దీని నిర్వహణకు సంబంధించి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి. విద్యుత్తు సరఫరా, పరిశుభ్రతపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి' అని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో ఆర్డీవో సాయిప్రత్యూష, డ్వామా పీడీ సుధాకరరావు, ఉప కలెక్టర్ లక్ష్మణరావు, విపత్తు నివారణ అధికారి మోహనరావు, ఏఈ సురేష్, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఆదిత్యుడి రూపంలో.. విద్యుత్ దీపాలతో అలంకరణ



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



ఉద్దానంలో కాపుకాస్తున్న జీడి తోటలు

జీడి ధర పెరిగేనా?


- ఏడేళ్లుగా గిట్టుబాటు ధర కరువు
- బస్తా పిక్కలు రూ.10వేలు పలుకుతున్న వైనం
- రూ.16వేలు ఇవ్వాలంటున్న రైతులు
- అంత ధరకు కొనుగోలు చేయలేమంటున్న వ్యాపారులు
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు



పలాస, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఏటా జనవరి వచ్చిందంటే జీడి పిక్కల సీజను ప్రారంభమై ఉద్దానం గ్రామాల్లో సందడి నెలకొంటుంది. రైతులు జీడి తోటల్లో తాత్కాలిక నివాసం ఏర్పాటు చేసుకొని జీడి పిక్కలను సేకరిస్తుంటారు. వాటిని విక్రయిస్తూ వచ్చే ఆదాయంతో ఏడాదంతా కుటుంబంతో ఆనందంగా గడుపుతుంటారు. అయితే, గత ఏడేళ్లుగా జీడి పిక్కల దిగుబడి బాగున్నా, ఆశించిన మద్దతు ధర లేకపోవడంతో రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. ఎకరా జీడి తోటలో ఫలసాయం పొందాలంటే రూ.15 వేల వరకూ పెట్టుబడి అవుతుంది. ప్రకృతి కరుణిస్తేనే పంట చేతికి అందుతుంది. లేదంటే నష్టపోవాల్సిందే. జిల్లాలో ఉద్దానంతోపాటు ఏజెన్సీ ప్రాంతంలో 27వేల హెక్టార్లలో జీడి పంట సాగవుతోంది. ప్రస్తుతం పలాస మార్కెట్‌లో విదేశీ జీడి పిక్కల బస్తా (80 కిలోలు) రూ.14,500 వరకూ పలుకుతుండగా, దేశీయ పిక్కలను మాత్రం రూ.10వేలకు మించి కొనుగోలు చేయడం లేదు. ఈ ఏడాదైనా గిట్టుబాటు ధర లభిస్తుందని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

గిట్టుబాటు ధర కోసం పోరాటం..

దేశీయ జీడి పిక్కలకు గిట్టుబాటు ధర కల్పించాలని జిల్లావ్యాప్తంగా ఉన్న జీడి రైతులు ఒకేతాటిపైకి వచ్చి ఎన్నో ఏళ్లగా పోరాటం చేస్తున్నా ఫలితం శూన్యం. ఏటా అదిగో ఇదిగో అంటూ ప్రభుత్వాలు వారికి ఊరటనిస్తున్నాయే తప్ప గిట్టుబాటు ధరపై స్పష్టమైన ప్రణాళికతో ముందుకు వెళ్లడం లేదనే విమర్శలు ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వం జీడి బస్తాకు రూ.వెయ్యి పెంచుతామని చెప్పడంతో రైతులు ఆనందపడ్డారు. తీరా జీడి పిక్కలు చేతికందిన తరువాత మొండిచేయి చూపించింది. దీంతో తమకు తోచిన ధరకు రైతులు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో (మిగతా 4వ పేజీలో..)



కొనసాగుతున్న మూలపేట పోర్టు పనులు (ఫైల్)

నిర్మలమ్మా.. నిధులివ్వండి!

- పూర్తికాని పోర్టు, హార్బర్ నిర్మాణాలు
- నత్తనడకన అమృత్ భారత్ రైల్వే పనులు
- కొంతమేరకే జాతీయ రహదారి విస్తరణ
- నేటి నుంచి కేంద్ర బడ్జెట్ సమావేశాలు

తలసరి ఆదాయంలో సిక్కోలు వెనుకబడుతూనే ఉంది. పూర్తికాని ప్రాజెక్టులు, అభివృద్ధికి నోచుకోని రైల్వేస్టేషన్లకు నిధుల కొరత వెంటాడుతూనే ఉంది. మరోవైపు నరసన్నపేట నుంచి ఇచ్ఛాపురం వరకూ ఆరులేన్ల హైవే విస్తరణ ప్రతిపాదనలకే పరిమితమవుతోంది. ఇంకోవైపు పెరుగుతున్న నిత్యావసరాల ఖర్చులతో వేతన జీవులు, మధ్య తరగతి ప్రజల్లో గుబులు రేగుతోంది. బడ్జెట్ ప్రవేశపెట్టే ప్రతిసారీ ఆదాయపు పన్ను శ్లాబులు పెంచుతామనే సంకేతాలు పంపడం.. తర్వాత నిరాశ చూపడం షరా మామూలై పోయింది. శనివారం నుంచి ప్రారంభం కానున్న కేంద్ర బడ్జెట్‌లోనైనా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్.. నిధులు కేటాయిస్తారని జిల్లావాసులు ఎదురు చూస్తున్నారు.

శ్రీకాకుళం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్ సమావేశాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. జిల్లాలో పలు ప్రాజెక్టులు పూర్తికావాలంటే బడ్జెట్‌లో నిధుల కేటాయింపు కీలకం. తలసరి ఆదాయంలో వెనుకబడిన సిక్కోలుపై కేంద్రం కరుణ చూపాలని.. ఈసారి ఆర్థికమంత్రి నిర్మలమ్మ ప్రవేశ పెట్టనున్న బడ్జెట్‌లో ప్రాజెక్టుల వారీ నిధులు కేటాయించాలని జిల్లావాసులు విజ్ఞప్తి చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన మూలపేట పోర్టు, అలాగే పలు చోట్ల ఫిషింగ్ హార్బర్, జెట్టీ నిర్మాణాలు కేంద్ర ప్రభుత్వ సహకారంతో చేపట్టేవే. అవన్నీ రాష్ట్ర ప్రభుత్వమే నిర్మించినట్లు అప్పట్లో వైసీపీ గొప్పలు చెప్పుకుంది. కేంద్రప్రభుత్వ సంస్థ ఆధీనంలో ఉన్న 'సాగరమాల' ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ మారీటైమ్ బోర్డు పోర్టు, హార్బర్ పనులు చేపట్టింది. మూలపేట పోర్టు.. బంగాళాఖాతం తీరాన ఉన్న అటు ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, దక్షిణ ఒడిశా ప్రాంతాలకు కార్గో సేవలు అందుబాటులోకి వచ్చేలా ఏర్పాటు కానుంది. అలానే తీరప్రాంతానికి ఆనుకుని 16వ జాతీయ రహదారి, ఈస్ట్ కోస్టు రైల్వే లైన్ తదితరవి అభివృద్ధి చెందనున్నాయి. సుమారు రూ.3600 కోట్ల వ్యయంతో నాలుగు బెర్తులతో ప్రస్తుతానికి నిర్మాణం చేపట్టేలా.. ఏడాది 15 మిలియన్ల కార్గో సేవలు పోర్టు ద్వారా జరిగేలా లక్ష్యం తో ఏర్పాటవుతోంది. 3వేల ఎకరాల పోర్టు ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు కానున్నా యి. పోర్టు కోసం.. పోర్టు అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేయాలంటే కేంద్రం నిధులు విడుదల చేయాల్సి ఉంది. మంచినీళ్లపేట వద్ద జెట్టీ, బుడగట్లపాలెం వద్ద ఫిషింగ్ హార్బర్ పనుల్లో ఎటువంటి పురోగతి లేదు. దీనిపై కదలిక వచ్చేలే... తీరప్రాంతంలో ప్రత్యక్షంగా మత్స్యకారులకు.. పరోక్షంగా జిల్లా ప్రజలకు ఉపాధి లభించేలా పోర్టు, హార్బర్, జెట్టీ పూర్తయ్యేలా కేంద్రం చొరవ చూపాలి. ఇందుకుగాను నిధులు కేటాయిస్తే ఫలితం ఉంటుంద ని జిల్లావాసులు అభిప్రాయపడుతున్నారు.

ఆరు లేన్ల హైవేగా విస్తరణ ఎప్పుడో..

విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం మీదు గా నరసన్నపేట వరకు ఆరు లేన్ల హైవే రోడ్డు విస్తరణ జరిగింది. ఇంకా నరసన్నపే ట నుంచి జిల్లా సరిహద్దు ప్రాంతమైన ఇచ్ఛాపురం వరకు ప్రస్తుతం నాలుగులైన్ల హైవే ఉంది. దీన్ని ఆరులేన్ల హైవేగా మార్పుచేస్తామని.. ప్రజాప్రతినిధులు ప్రకటించారు. అలానే నిధులు మంజూరు చేయాలని ప్రతిపాదనలు పంపారు. కానీ కార్యరూపం దాల్చలేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య కూటమి నేపథ్యంలో.. ఈసారి బడ్జెట్‌లో హైవే విస్తరణకు నిధులు (మిగతా 4వ పేజీలో..)

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ఇంటర్ పరీక్షలకు వేళాయే

- నేడు నైతికత - మానవత విలువలపై..
- 3న పర్యావరణపై
- వచ్చే నెల 1 నుంచి థియరీ

5లో

దారీ లేదు.. నీరూ లేదు

- ఇదీ సీతారాంపురం కాలనీ దుస్థితి
- నివసించేదెలా అని లబ్ధిదారుల ఆందోళన

6లో

డిగ్రీ విద్యార్థినిపై దాడి!

- వసతిగృహం వద్ద అపస్మారకస్థితిలో..
- ముఖం, చేయిపై కమిలిన గాయాలు
- కలెక్టర్, ఎస్పీతో మాట్లాడిన అచ్చెన్నాయుడు
- నిందితులను అరెస్టు చేయాలని ఆదేశం


శ్రీకాకుళం క్రైం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలో ఓ బీఎస్సీ విద్యార్థినిపై దాడి ఘటన కలకలం రేపింది. కొద్ది రోజుల కిందట జరిగిన ఓ వివాహిత హత్య ఉదంతం మరువక ముందే ఈ ఘటన చోటుచేసుకోవడంతో నగర వాసులు ఉలిక్కిపడ్డారు. పోలీసుల వివరాల మేరకు.. సంతకవిటి మండలం కొండగూడెం గ్రామానికి చెందిన కొరికాన లక్ష్మి.. శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బీఎస్సీ ఫైనలియర్ చదువుతోంది. 2022లో కళాశాలలో చేరిన ఆ యువతి.. ప్రభుత్వ బీసీ బాలికల వసతిగృహం-3లో ఉంటోంది. ఫైనలియర్‌లో ఇంటర్న్‌షిప్‌నకు ఎంపికైంది. దీంతో కళాశాలకు వెళ్లకుండా నేరుగా ఎల్‌బీఎస్ కాలనీలోని మష్రూమ్ తయారీ కేంద్రంలో శిక్షణ తీసుకుంటూ వసతి గృహంలో ఉంటోంది. గురువారం శిక్షణ లేకపోవడంతో ఉదయమంతా వసతిగృహంలోనే ఉంది. మధ్యాహ్నం 3 గంటల సమయంలో రికార్డుల కోసం అని చెప్పి బయటకు వెళ్లింది. రాత్రి 8-20గంటల సమయంలో ఒంటిపై గాయాలతో వసతిగృహానికి సమీపాన పడి ఉండడం తోటి విద్యార్థినులకు కనిపించింది. వారు వెంటనే వసతిగృహం వార్డెన్‌కు సమాచారం అందించగా రాత్రి 9గంటల సమయంలో చికిత్స నిమిత్తం యువతిని జీజీహెచ్ (రిమ్స్)లో చేర్పించారు. మూర్ఛతో ఆమె పడిపోయి ఉంటుందని (మిగతా 5వ పేజీలో..)



చికిత్స పొందుతున్న లక్ష్మి



ఘటనపై ఆరా తీస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



శ్రీకాకుళం సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయంలో శుక్రవారం రాత్రి 7 గంటలకు రద్దీ ఇలా..

ఒక్కరోజు.. 300 రిజిస్ట్రేషన్లు

- జిల్లాలో రాత్రి 8 వరకూ ప్రక్రియ
- నేటి నుంచి కొత్తచార్జీల అమలు

శ్రీకాకుళం, జనవరి 31(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలన్నీ శుక్రవారం కిటకిటలాడాయి. రాత్రి వరకు క్రయవిక్రయదారులతో హడావిడిగా కనిపించాయి. ఫిబ్రవరి 1నుంచి కొత్తచార్జీలు అమలుకానుండటంతో.. రిజిస్ట్రేషన్లకు ఒక్కసారిగా తాకిడి పెరిగింది. గురువారం జిల్లాలోని 13 సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో 330 డాక్యుమెంట్లకు రిజిస్ట్రేషన్లు జరగ్గా.. శుక్రవారం 300 డాక్యుమెంట్లకు రిజిస్ట్రేషన్లు అయ్యాయి. నెలాఖరు కావడం.. రాష్ట్ర వ్యాప్తంగా రిజిస్ట్రేషన్ల సంఖ్య ఒక్కసారి పెరగడంతో ఆన్‌లైన్ సర్వర్లు మొరాయించాయి. దీంతో క్రయవిక్రేతలు.. భూముల కొనుగోలుదారులు.. రిజిస్ట్రేషన్ల కోసం గంటల తరబడి నిరీక్షించారు. సాయంత్రం ఆరు తర్వాత సర్వర్లు పనిచేయడంతో అప్పటివరకు ఉన్న పెండింగ్‌వన్నీ రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి.

4లో

భూముల విలువ పెరుగుతోంది

భూముల విలువ పెరుగుతోంది

- నేటి నుంచి మార్కెట్ ధర పెంపు
- పట్టణాల్లో 10 నుంచి 35 శాతం...
- గ్రామాల్లో 65 శాతం వరకు పెరుగుదల



శ్రీకాకుళంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రద్దీ

నరసన్నపేట/ఆమదాలవలస, జనవరి 31(ఆంధ్రజ్యోతి)

శ్రీకాకుళం పట్టణం, సమీప ప్రాంతాల్లో ఎకరా భూమి ధర రూ.10 కోట్ల వరకు ఉంది. ప్రభుత్వ ధర మాత్రం రూ.80 లక్షల నుంచి రూ.1.20 కోట్ల వరకు ఉంది. నరసన్నపేట పట్టణంలో జాతీయ రహదారి సమీపంలో ఎకరా రూ.40 లక్షల వరకు మార్కెట్ ధర ఉంది. బహిరంగ మార్కెట్‌లో ఎకరం రూ.4 కోట్ల నుంచి రూ.6 కోట్ల వరకు ఉంది. నరసన్నపేట పరిసరాల్లో ప్రభుత్వ ధర ఎకరా రూ.13 లక్షలు కాగా.. బయట ఎకరా రూ. 4 కోట్ల నుంచి రూ.6 కోట్లు పలుకుతోంది. శనివారం నుంచి వీటి ధర మరింత పెరగనుంది. ప్రభుత్వం భూముల మార్కెట్ విలువ పెంచుతుండడమే దీనికి కారణం. పట్టణాల్లో ఈ పెంపు 10 నుంచి 35 శాతం వరకు ఉండగా... గ్రామీణ ప్రాంతాల్లో 65 శాతం వరకు ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా పెంచిన భూముల విలువలను కచ్చితంగా అమలు చేయాలని జిల్లాలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్, ఐజీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. క్రయవిక్రయాల సమయంలో మార్కెట్ విలువ ఆధారంగా స్టాంపు డ్యూటీ చెల్లింపులు ఉంటాయి. తద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. భూముల మార్కెట్ విలువలు పెరిగిన నేపథ్యంలో ప్రభుత్వానికి కూడా ఆమేరకు ఆదాయం సమకూరనుంది. అదే సమయంలో ప్రభుత్వ అవసరాలకు భూములు సేకరిస్తే... ఈ పెంపు వల్ల రైతులకు మేలు జరిగే అవకాశం ఉంటుంది.



నరసన్నపేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో క్రయవిక్రయదారులు

● గతంలో వాయిదా..

గత డిసెంబరు నెలలో రాష్ట్ర ఐజీ కార్యాలయం నుంచి అందిన ఆదేశాల మేరకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్థానిక సంస్థల కమిషనర్లతో వార్డుల వారీగా భూముల విలువల పెంపుదలకు సంబంధించిన కార్యాచరణ పూర్తి చేశారు. జనవరి ఒకటో తేదీ నుంచే పెంపునకు నిర్ణయించినా... ప్రభుత్వం వాయిదా వేసింది. తిరిగి నెల రోజుల అనంతరం భూ విలువలు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. భూముల విలువలు పెరగనున్న నేపథ్యంలో గురు, శుక్రవారాల్లో జిల్లా వ్యాప్తంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రద్దీ నెలకొంది. విలువలు పెరగకముందే రిజిస్ట్రేషన్ చేసుకోవాలనే ఉద్దేశంతో క్రయ విక్రయదారులు రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద బారులుతీరారు.

● యజమానులకు భరోసా..

ప్రభుత్వం భూముల విలువ పెంచడంతో సంబంధిత యజమానులకు ఆర్థిక భరోసా పెరుగుతుంది. తన భూమికి మార్కెట్ విలువ ఆధారంగా బ్యాంకులలో మార్టుగేజ్ రుణాలు పొందేందుకు అవకాశం ఉంటుంది. ఉద్యోగులతో పాటు భూములు ఉన్న వారికి కూడా పరపతి పెరిగేందుకు దోహదపడుతుందని రైతులు చెబుతున్నారు. కొండ, మైదాన ప్రాంతాల్లో కూడా భూములు విలువలను పెంచడం కొంతవరకు రైతులకు ఊరట కలిగిస్తోంది.

● సర్వర్ డౌన్..

భూముల విలువ పెరగక ముందే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని అత్యధిక శాతం ప్రజలు తలచారు. దీంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు రద్దీగా మారాయి. మరో వైపు శుక్రవారం సర్వర్‌డౌన్ అయింది. దీంతో కొంతమేరకు రిజిస్ట్రేషన్లకు ఆటంకం కలిగింది. ఆమదాలవలస సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఒక్క గురువారమే 30 రిజిస్ట్రేషన్లు జరిగినట్టు భోగట్టా. రాత్రి 9 గంటల వరకు రిజిస్ట్రేషన్లు చేసినట్టు సబ్ రిజిస్ట్రార్ రఘుపాత్రుని జగదీశ్వరరావు తెలిపారు. శుక్రవారం కూడా అదే స్థాయిలో రద్దీ ఉంది. సర్వర్‌డౌన్ కారణంగా సిబ్బంది, క్రయవిక్రయదారులు ఇబ్బంది పడ్డారు. రాత్రి వరకూ రద్దీ అలాగే కొనసాగింది.



ఆమదాలవలస: శుక్రవారం రాత్రి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద వేచి ఉన్న క్రయవిక్రయదారులు



దాతలంటే అంత అలుసా?

- నేటి రాత్రి 8 గంటల్లోగానే పాసులిస్తారట
- అదీ మధ్యాహ్నం 2.30 గంటల తరువాతేనట
- 1250 మందికి జారీ ఎలా సాధ్యమని సందేహాలు

అరసవల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రథసప్తమి సందర్భంగా దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి దాతలు ఏటా ఆదిత్యుని దర్శనానికి వస్తుంటారు. ఆలయంలో అధిక శాతం అభివృద్ధి దాతల విరాళాలతోనే జరుగుతోందంటే అతిశయోక్తి కాదు. భక్తులు ఉచిత అన్నప్రసాదాన్ని స్వీకరిస్తుండడానికి కారణం దాతల విరాళాలే. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆలయం ఎదుట ప్రసాదాల కౌంటర్ల పైభాగంలో దాతల సాయంతో 10 కొత్త గదులను నిర్మించారు. వాటిలో ఏసీలు, టీవీలు, గీజర్లు వంటి అన్ని సదుపాయాలు దాతలే కల్పించారు. ఇవి నిర్మించి కేవలం ఏడాది మాత్రమే కావస్తోంది. ఆలయ అభివృద్ధిలో భాగంగా వాటిని కూడా ఇటీవల కూల్చేశారు. లక్షలాది రూపాయలు ఆలయ అభివృద్ధి కోసం విరాళంగా అందజేసిన భక్తులు తమకు కనీస సమాచారం కూడా ఇవ్వకుండా కూల్చేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రిజిస్ట్రేషన్ చేసుకోవాలని...

ఇదంతా ఒక ఎత్తయితే రథసప్తమికి సంబంధించి పాసుల కోసం ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలనే కొత్త నిబంధన పెట్టడంతో దాతలు వ్యయప్రయాసలకు గురయ్యారు. ఇంతా చేసి ఆలయానికి వస్తే కనీసం పలకరించే దిక్కు లేకుండాపోయింది. అయినా సరే దాతలు అవమానాలను భరించి పాసుల కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. రూ.లక్ష విరాళం ఇచ్చిన దాతకు ఒక పాసు చొప్పున ఎన్ని రూ.లక్షలు విరాళమిస్తే అన్ని డోనర్ పాసులను ఆలయ అధికారులు గతంలో మంజూరు చేసేవారు. ఈ ఏడాది ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా రూ.10 లక్షలు ఇచ్చిన దాతకు కూడా కేవలం ఒక్క పాసు మాత్రమే జారీ చేస్తామని అధికారులు చెప్పడంతో వారంతా షాక్‌కు గురయ్యారు.

ఆ సమయంలోనే ఇస్తారట..

సుమారు 1250 మంది దాతలు పాసుల కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ఆలయ సిబ్బంది చెబుతున్నారు. వీటి కోసం శనివారం మధ్యాహ్నం 2.30 నుంచి రాత్రి 8 గంటల మధ్య రావాలని చెప్పడంతో దాతలు హతాశులయ్యారు. కేవలం 6 గంటల సమయంలోనే సిబ్బంది దాతల నుంచి అన్ని వివరాలను సరిచూసుకుని పాసులను ఎలా జారీ చేస్తారో... వారికే తెలియాలి. అధికారుల అనాలోచిత నిర్ణయాలతో భవిష్యత్తులో ఆలయ అభివృద్ధికి అవసరమైన నిధుల సేకరణలో ఇబ్బందులు ఎదుర్కోక తప్పదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

● వీఐపీ దర్శనాలు లేనట్టే..

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రకటన విడుదల కావడంతో ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చింది. దీంతో రథసప్తమి వేడుకలకు వచ్చే వీఐపీలు, వీవీఐపీలు, అధికారులు, నాయకులకు, మంత్రులకు జారీ చేసే పాసులు, ప్రొటోకాల్ దర్శనాలు నిలిచిపోనున్నాయి. ఇప్పటికే ఆలయ అధికారులు వీరి కోసం కొన్ని పాసులను కేటాయించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో వాటన్నింటినీ రద్దు చేయనున్నారు. శనివారం కేవలం దాతలకు మాత్రమే పాసులు జారీ చేయనున్నట్లు ఆలయ అధికారులు స్పష్టం చేశారు.

రథసప్తమి వేడుకలకు

పటిష్ఠ చర్యలు

- రేపటి నుంచి సిక్కోలులో ట్రాఫిక్ ఆంక్షలు ● 4వ తేదీ అర్ధరాత్రి వరకు కొనసాగింపు
- ఉత్సవాల నిర్వహణకు ప్రజలు సహకరించాలి
- కేటాయించిన సమయాల్లోనే భక్తులకు దర్శనం
- అదనపు ఎస్పీ కేవీ రమణ



రథసప్తమి రూట్ మ్యాప్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం క్రైం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రథసప్తమి వేడుకలకు వచ్చే భక్తులకు అసౌకర్యం కలుగకుండా పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా అదనపు ఎస్పీ కె.వి.రమణ పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ రథసప్తమి సందర్భంగా ఈ నెల 2, 3, 4 తేదీల్లో జరిగే వేడుకలకు 2,300 మంది పోలీసులతో పకడ్బందీగా బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ మూడు రోజులు నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు అమలవుతా యని చెప్పారు. ఉత్సవాలకు హాజరయ్యే భక్త లు ఈ విషయాన్ని గమనించి పోలీసులతో సహకరించాలని కోరారు. ప్రతి ఒక్కరూ నిర్దే శించిన ప్రదేశాల్లో వాహనాలను పార్కింగ్ చేసుకోవాలని చెప్పారు. భక్తులకు స్వామివారి దర్శనానికి రూ.300, రూ.500, డోనర్ పాసులు (క్షీరాభిషేకం) ఉన్నవారు తమకు కేటాయించిన సమయంలోనే దర్శనం చేసుకోవాలని సూచించారు. అనంతరం రథసప్తమి వేడుకలకు సంబంధించి ప్రవేశ, బయటకు వచ్చే మార్గాలు, వాహనాల పార్కింగ్ స్థలాలు, ట్రాఫిక్ మళ్లింపు చర్యలు, క్యూలైన్లు తదితర అంశాలు తెలియజేసే పోస్టర్లను అదనపు ఎస్పీ కె.వి.రమణ, డీఎస్పీ వివేకానంద, ఎస్బీ సీఐ ఇమాన్యుయల్ రాజు, టౌన్ సీఐ పి.పైడపునాయుడు, ట్రాఫిక్ సీఐ నాగరాజుతో కలిసి ఆవిష్కరించారు.

● దర్శనానికి వచ్చే మార్గాలు ఇవే..

● నగరంలోకి భక్తులు సింహద్వారం, కిమ్స్ రోడ్డు, డే అండ్ నైట్ జంక్షన్, ఏడురోడ్ల జంక్షన్, పాత బస్టాండు మీదుగా అరసవల్లి మిల్లు జంక్షన్ వద్దకు చేరుకోవాలి. 80 అడుగుల రోడ్డులో, ఎల్.ఎన్.ఫంక్షన్ హాల్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలాల్లో వాహనాలను పార్కింగ్ చేయాలి.

● కొత్తరోడ్డు నుంచి వచ్చేవారు బలగ మీదుగా ఆర్టీసీ కాంప్లెక్స్, డే అండ్ నైట్, ఏడురోడ్ల కూడలి, పాత బస్టాండు మీదుగా మిల్లు జంక్షన్‌కు చేరుకుని పైన తెలిపిన ప్రదేశాల్లో వాహనాలను పార్కింగ్ చేసుకోవాలి.

● పెద్దపాడు మీదుగా రామలక్ష్మణ కూడలి, సూర్యమహల్ జంక్షన్, చిన్నబరాటం వీధి, పాత బస్టాండు మీదుగా 80 అడుగుల రోడ్డులోకి వచ్చేవారు కేటాయించిన స్థలంలో నిలపవలసి ఉంటుంది.

● నవభారత్ మీదుగా వచ్చేవారు గుజరాతీపేట, ఏడురోడ్ల కూడలి, పాతబస్టాండు మీదుగా మిల్లు జంక్షన్‌కు చేరుకుని.. 80 అడుగుల రోడ్డులో పార్కింగ్ చేసుకోవాలి.

● గార, శ్రీకూర్మం మీదుగా వచ్చే భక్తులు వాడాడ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన ప్రదేశంలో తమ వాహనాలను పార్కింగ్ చేసుకోవాలి.

● టెక్కలి, నరసన్నపేట వైపు నుంచి వచ్చే భక్తులు అంపోలు అండర్ బ్రిడ్జి సర్వీసు రోడ్డులోకి ప్రవేశించి, జైలు రోడ్డు మీదుగా, అడవరం గ్రామం దాటి అంపోలు మీదుగా గార రోడ్డుకు చేరుకోవాలి. వాడాడ జంక్షన్ వద్ద తమ వాహనాలను పార్కింగ్ చేసుకోవాలి.

● పార్కింగ్ స్థలాలు..

● 80 అడుగుల రోడ్డులో కేంద్ర మంత్రి నివాసం పక్కన గల ఖాళీ స్థలంలో ఆటోలు, టాటా ఏసీలు, పార్కింగ్ చేసుకోవాలి. అలాగే ఇంటి ఎదురుగా గల ఖాళీ స్థలంలో మోటారు సైకిళ్లు, కార్లు, పార్కింగ్ చేసుకోవాలి.

● బీకేఎస్ కాలేజీ పక్కన కొత్తగా ఏర్పాటు చేసిన రోడ్డు మార్గం ద్వారా కొయ్యాన కన్నయ్య కాలనీలో గల ఎల్.ఎన్.ఫంక్షన్ హాలు ఎదురుగా గల ఖాళీ ప్రదేశంలో కారు పార్కింగ్ చేసుకోవాలి.

● అరసవల్లి మెయిన్ ఆర్చి ఎదురుగా సూర్యతేజ ఫంక్షన్ హాలుకు చెందిన ఖాళీ ప్రదేశంలో వీవీఐపీల వాహనాల పార్కింగ్ ఉంటుంది.

● వాడాడ జంక్షన్ వద్ద అసిరితల్లి ఆలయం సమీపంలో ఉన్న ఖాళీ స్థలంలో కార్లు, మోటారు సైకిళ్ల పార్కింగ్ చేసుకోవచ్చు.

● ఖాజీపేట మీదుగా వచ్చే వాహనాలకు అరసవల్లి మున్సిపల్ హైస్కూల్ పక్కన గల ఖాళీ స్థలంలో పార్కింగ్‌కు కేటాయించారు.

దర్శనానంతరం బయటకు వెళ్లే మార్గాలు..

దర్శనానంతరం భక్తులు తాము వాహనాలను పార్క్ చేసిన చోటుకు వెళ్లి 80 అడుగుల రోడ్డు నుంచి వాంబే కాలనీ జంక్షన్, పొన్నాడ బ్రిడ్జి జంక్షన్, సంతోషిమాత ఆలయం, జెడ్పీ మీదుగా పాతబస్టాండుకు చేరుకోవాలి. అక్కడి నుంచి ఏడురోడ్ల కూడలి మీదుగా నవభారత్ జంక్షన్ మీదుగా హైవేకు చేరుకుంటారు. అలాగే టెక్కలి, నరసన్నపేట మార్గంలో వెళ్లే భక్తులు వాడాడ జంక్షన్ మీదుగా వప్పంగి, సానివాడ, శాస్త్రులపేట మీదుగా చెట్టువానిపేట గ్రామం వద్ద రహదారిని చేరుకోవాలి.

● ట్రాఫిక్ ఆంక్షలు..

● 2వ తేదీ (ఆదివారం) ఉదయం 7 గంటలకు 80 అడుగుల రోడ్డులో ఐదువేల మందితో సూర్యనమస్కారాల కార్యక్రమం నిర్వహిస్తారు. దీనికోసం వాహనాల పార్కింగ్ కోసం అదే రోడ్డులో స్థలాన్ని కేటాయించారు. ఆ రోడ్డులో ట్రాఫిక్ అంక్షలు అమలవుతాయి. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 7 గంటల వరకు జరిగే స్వామివారి శోభాయాత్ర సమయంలో ట్రాఫిక్ ఆంక్షలు అమలవుతాయి.

● 3వ తేదీన (సోమవారం) సాయంత్రం ఆర్ట్స్ కాలేజీ మైదానంలో జరిగే సాంస్కృతిక కార్యక్రమాల సమయంలో కూడా ట్రాఫిక్ మళ్లింపు చర్యలు ఉంటాయి.

ఆభరణాలు ధరించవద్దు..

స్వామివారి దర్శనానికి వచ్చే మహిళలు ఆభరణాలు ధరించి రావద్దని ఏఎస్పీ కె.వి.రమణ సూచించారు. పార్కింగ్ స్థలాల కోసం సైన్ బోర్డులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. వాటి సాయంతో కేటాయించిన పార్కింగ్ స్థలాలకు చేరుకోవాలని ఆయన సూచించారు.

నేడు దాతలకు పాసుల జారీ..

అరసవల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రథసప్తమి వేడుకలకు సంబంధించి రూ.లక్షకు పైగా విరాళాలు అందజేసిన దాతలకు శనివారం పాసులు జారీ చేయనున్నారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి రాత్రి 8.30 వరకు పాసులు జారీ చేయనున్నట్టు ఆలయ ఈవో వై.భద్రాజీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దాతలు తమ పాసులు తీసుకునే సమయంలో విరాళాల రశీదులు, పాసుల కోసం చేసుకున్న రిజిస్ట్రేషన్ కాపీలను తీసుకురావాలని ఆయన సూచించారు.

జీడి ధర పెరిగేనా?

(మూడో పేజీ తరువాయి)

జీడి రైతాంగ సాధన కమిటీ నాయకులు గ్రామాల్లోకి వెళ్లి రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. పిక్కలను తమ వద్దే ఉంచుకోవాలని, ధర వస్తే ఇద్దామని రైతులకు చెబుతున్నారు. ప్రస్తుతం 80 కిలోల జీడి పిక్కల బస్తాకు రూ.16వేలు గిట్టుబాటు ధర కావాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. అయితే, అంత ధరకు తాము కొనుగోలు చేయలేమని వ్యాపారులు చెబుతున్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి ఇద్దరి మధ్య చర్చలు జరిపి, ఇరువర్గాలకూ ఆమోదయోగ్యమైన ధరను నిర్ణయించాల్సిన అవసరం ఉంది.

మద్దతు ధర ప్రకటించాలి..



జీడి పిక్కల ధరల అంశాన్ని ఎమ్మెల్యే గౌతు శిరీష ఇటీవల అసెంబ్లీలో ప్రస్తావించారు. దీనిపై ప్రభుత్వం స్పందించి ధర పెంచుతామని హామీ ఇచ్చింది. కానీ, జీవో ఇప్పటికీ విడుదల కాకపోవడంతో రైతుల్లో నైరాశ్యం నెలకొంది. శాఖాపరమైన చర్యలు చేపట్టి తక్షణమే జీడికి మద్దతు ధర ప్రకటించాలి.

-తెప్పల అజయ్‌కుమార్, జీడి రైతాంగ సాధన కమిటీ కన్వీనర్

నిర్మలమ్మా.. నిధులివ్వండి!

(మూడో పేజీ తరువాయి)

మంజూరవుతాయని పలువురు భావిస్తున్నారు. ఆరు లేన్ల విస్తరణ చేస్తే కోల్‌కత్తా-చెన్నై వాహనాల రాకపోకల విషయంలో జిల్లాలో ఏవిధమైన అంతరాయం ఉండదు. ఒడిశాకు ప్రయాణం రెండు గంటలు సమయం మాత్రమే అవుతుంది. అలాగే రవాణా మార్గాలు మెరుగుపడితే.. అభివృద్ధి మరింత పరుగులెడు తుంది. హైవే విస్తరణపై దృష్టి సారించి నిధులు విదుల్చుతారని జిల్లా వాసులు కోరుతున్నారు.

● ఆదాయపు పన్నులో ఊరట దక్కేనా?

కేంద్ర బడ్జెట్ సమయంలో ప్రతిసారీ ఆదాయపు పన్నులో ఊరట ఉంటుందేమో అని ఉద్యోగులు ఎదురుచూస్తునే ఉన్నారు. ఇప్పుడు కూడా ఆశగానే ఉన్నారు. వేతన జీవుల నిరీక్షణ ఈ దఫా ఫలిస్తుందని భావిస్తున్నారు. కొత్త పన్నుల విధానంలో శ్లాబుల సవరణ, స్టాండర్డ్ డిడక్షన్ పెంపు, రిబేట్ పెంపు వంటి అంశాలపై ఉద్యోగులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

● నత్తనడకన అమృత్ భారత్ రైల్వే పనులు..

అమృత్ భారత్ పథకం కింద పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల పరిధిలో రైల్వేస్టేషన్ల అభివృద్ధికి రూ.25కోట్లు చొప్పున నిధులు మంజూరయ్యాయి. పనులు ఇప్పటికీ నత్తనడకన సాగుతున్నాయి. నిధుల సమస్య పైకి వెల్లడించడంలేదు. అలాగే జిల్లాలో పలుచోట్ల రైల్వే అండర్ పాసేజీల నిర్మించాల్సి ఉంది. రైల్వేస్టేషన్లను ఆధునికీకరించాల్సి ఉంది. ఇందుకోసం రైల్వేబడ్జెట్‌కు ప్రాధాన్యమిస్తే జిల్లాలో ఈస్ట్‌కోస్టు రైల్వేలైన్‌తోపాటు.. ఉత్తరాంధ్రలో జిల్లా మీదుగా ఒడిశాలో కొన్ని ప్రాంతాలకు రైల్వే లైన్ల అభివృద్ధి చేస్తామని గతంలో ప్రజాప్రతినిధులు ప్రకటనలు చేశారు. ఇప్పటికైనా రైల్వే స్టేషన్ల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని జిల్లావాసులు కోరుతున్నారు.



మెట్ల మార్గంలో విద్యుత్ కాంతులు

శ్వేతగిరి యాత్రకు చురుగ్గా ఏర్పాట్లు

గార, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర జిల్లాల్లో ప్రసిద్ధిచెందిన శాలిహుండాంలోని శ్వేతగిరిపై భీష్మ ఏకాదశి సందర్భంగా ఈ నెల 8న యాత్ర నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. ఈ యాత్రకు ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు, ఒడిశా నుంచి కూడా వేలాది మంది భక్తులు తరలిరానున్నారు. ఈ నేపథ్యంలో భక్తుల సౌకర్యార్థం దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ సుగ్గు మధురెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రత్యేక క్యూలైన్‌లు ఏర్పాటు చేశారు. రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నారు. అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఆలయాన్ని, పరిసర ప్రాంతాలను విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు.

రథసప్తమి కళ

- శ్రీకాకుళం నగరం ముస్తాబు ● విద్యుత్ కాంతులతో కొత్త శోభ

రథసప్తమి వేడుకలకు శ్రీకాకుళం జిల్లా కేంద్రం... అరసవల్లి క్షేత్రం సర్వాంగ సుందరంగా ముస్తాబవుతున్నాయి. అరసవల్లిలోని ఆదిత్యుని ఆలయ పరిసరాలతో పాటు నగరమంతటా విద్యుత్ దీపాలతో అలంకరించారు. నగరంలోకి ప్రవేశించే వివిధ మార్గాలు... ముఖ్య కూడళ్లలో విద్యుత్ దీపాలతో ప్రత్యేక ఆర్చిలు సిద్ధం చేశారు. ఇవి ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి.

- అరసవల్లి, జనవరి 31(ఆంధ్రజ్యోతి):







నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలపై రాజకీయ పార్టీల నాయకులకు అవగాహన

శ్రీకాకుళం కలెక్టరేట్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైందని, దీంతో జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. కలెక్టరేట్‌లో ఆయన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఫిబ్రవరి 3న నోటిఫికేషన్, 10వరకు నామినేషన్ల స్వీకరణ, 11న పరిశీలన, 13న నామినేషన్ల ఉపసంహరణ 27న పోలింగ్, మార్చి 3న ఓట్ల లెక్కింపు ఉంటుందని, మార్చి 8వ తేదీతో ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుందని తెలిపారు. తుది ఓటరు జాబితా ప్రకారం జిల్లాలో 31 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. జిల్లా పరిధిలో మొత్తం ఓటర్లు 4,829 కాగా అందులో పురుషులు 3,275, మహిళా ఓటర్లు 1554 మంది ఉన్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి పాటించాలని, అధికారులు, నాయకులకు సూచించారు. నియమావళి అమలుకు నోడల్ టీమ్‌లను ఏర్పాటు చేశామని, నియమాలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల సందర్భంగా పాటించాల్సిన నియమాలు, తీసుకోవాల్సిన అనుమతులను వివరించారు. సమావేశంలో ఆర్డీవో సాయిప్రత్యూష, టీడీపీ నుంచి పీఎంజే బాబు, కాంగ్రెస్ పార్టీ నుంచి కేవీఎల్ఎస్ ఈశ్వరి, బీఎస్పీ నుంచి లాసా సోమేశ్వరరావు, వైసీపీ నుంచి రౌతు శంకరరావు, బీజేపీ నుంచి సురేష్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ పుండ్కర్

ఇంటర్ పరీక్షలకు వేళాయే

- నేడు నైతికత - మానవత విలువలపై..
- 3న పర్యావరణంపై..
- వచ్చే నెల 1 నుంచి థియరీ

సోంపేట, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులు సన్నద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా 2024-25 విద్యా సంవత్సరానికి వార్షిక పరీక్షల నిర్వహణకు సంబంధించిన షెడ్యూల్‌ను ఇంటర్ విద్యా మండలి ఇప్పటికే ప్రకటించింది. ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఈ నెల 1న నైతికత - మానవ విలువలపైన, 3న పర్యావరణంపై పరీక్షలు నిర్వహిస్తారు. ప్రయోగ, థియరీ పరీక్షలతోపాటు ఈ రెండింట్లో పాసైతేనే ఇంటర్మీడియట్ పూర్తి అయినట్టు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ వృత్తివిద్యా కోర్సుల వారికి ఫిబ్రవరి 5 నుంచి 20వ తేదీ వరకు 114 కేంద్రాల్లో ప్రయోగ పరీక్షలు నిర్వహిస్తారు. ఉదయం 8 గంటల నుంచి 12గంటల వరకు మధ్యాహ్నాం 2గంటల నుంచి 5గంటల వరకు నిర్వహిస్తారు. జిల్లాలో 164 ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో 39,470మంది చదువుతున్నారు. ఇందులో మొదటి సంవత్సరంలో 20,678 మంది, ద్వితీయ సంవత్సరంలో 18,792మంది విద్యార్థులు హాజరు కానున్నారు. వీరిలో ప్రయోగ పరీక్షలకు 21,109 హాజరుకానున్నారు. వీరిలో వృక్ష, జంతు శాస్త్ర పరీక్షలకు 5,133 మంది, భౌతిక, రసాయన శాస్త్ర పరీక్షలకు 15,976మంది హాజరు కానున్నారు. ఈ సందర్భంగా ఆర్ఐవో దుర్గారావు మాట్లాడుతూ.. ఇంటర్ పరీక్షలు పగడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. థియరీ పరీక్షలు మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు జంబ్లింగ్ విధానంలో నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఇన్విజిలేటర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దళ్లవలస వీఆర్వో సరెండర్

పొందూరు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): దళ్లవలస వీఆర్వో తవుడుపై పలు ఆరోపణలు రావడంతో తహసీల్దార్ వెంకటేష్ రామానుజులు గురువారం రాత్రి శ్రీకాకుళం ఆర్డీవోకు సరెండర్ చేశారు. గతంలో పొందూరు వీఆర్వోగా పనిచేసిన తవుడుపై పలు ఫిర్యాదులు వచ్చాయి. వీటన్నిటిపై విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని తహసీల్దార్‌ను కలెక్టర్ ఆదేశించారు. దీంతో విచారణ చేపట్టిన తహసీల్దార్.. వీఆర్వోపై వచ్చిన ఆరోపణలపై ఆధారాలతో కలెక్టర్‌కు నివేదిక అందజేశారు. దీంతో క్రమశిక్షణా చర్యలకు కలెక్టర్ ఆదేశించడంతో వీఆర్వో తవుడును శ్రీకాకుళం ఆర్డీవోకు సరెండర్ చేసినట్టు తహసీల్దార్ వెంకటేష్ తెలిపారు.

వైసీపీ ఫీజు పోరు హాస్యాస్పదం

ఎచ్చెర్ల, జనవరి 31(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో విద్యార్థులకు ఫీజులు సక్రమంగా చెల్లించకుండా ఆ పార్టీ నేతలు ఆందోళన చేయాలనుకోవడం హాస్యాస్పదంగా ఉందని ఎచ్చెర్ల నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు బోర శ్రీనివాసరావు అన్నారు. ఫీజు పోరు ప్రకటన విడుదల సమయంలో మాజీ మంత్రి జోగి రమేష్ అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. గతంలో ఉన్న ఫీజు రియింబర్స్‌మెంట్ విధానాన్ని విద్యా దీవెనగా పేరు మార్చడమే తప్పా వైసీపీ చేసిందేముందని ప్రశ్నించారు. 2014-19 టీడీపీ పాలనలో 16 లక్షల మంది విద్యార్థులకు ఫీజు రియింబర్స్‌మెంట్ అందజేస్తే, వైసీపీ కేవలం 9 లక్షల మందికే పరిమితం చేసిందని విమర్శించారు. 2019కు ముందు ఫీజులను ప్రభుత్వమే నేరుగా కళాశాలకు చెల్లించేదని, దీంతో విద్యార్థులపై ఎలాంటి ఒత్తిడి ఉండేదికాదన్నారు. వైసీపీ పాలనలో ఎంతో మంది విద్యార్థులు చదువును మధ్యలోనే ఆపేశారన్నారు. కూటమి ప్రభుత్వంలో విద్యార్థులకు, యువతకు మేలు కలుగజేసే కార్యక్రమాలు చేపడుతున్నట్టు చెప్పారు.

అయోడిన్ లోపంపై అవగాహన

పొందూరు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): తాడివలస జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పిల్లల్లో అయోడిన్ లోపం వలన కలిగే నష్టంపై ఇనిస్టిట్యూట్ ఆఫ్ గ్లోబల్ డెవలప్‌మెంట్ (ఐజీడీ, ఢిల్లీ) ప్రతినిధులు అవగాహన కల్పించారు. విజయనగరం ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రొఫెసర్ ఐజీడీ రిసోర్స్‌పర్సన్ డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. అయోడిన్ లోపం వస్తే డ్రైస్కిన్, ఎదుగుదలలో లోపం, థైరాయిడ్ సమస్య, బలహీనత, రక్తహీనత ఏర్పడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఐజీడీ శ్రీకాకుళం జిల్లా కో-ఆర్డినేటర్ కె.శ్రీనివాస్, విజయనగరం జిల్లా కో-ఆర్డినేటర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లల గుర్తింపు

ఇచ్ఛాపురం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఈదుపురం, బిర్లంగి, మశాఖపురం, లొద్దపుట్టి, కొళిగాం ఇటుకుల పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు చెందిన బడిఈడు పిల్లలను గుర్తించినట్టు సమగ్ర శిక్ష సీఆర్‌టీలు తెలిపారు. శుక్రవారం అన్ని ఇటుకుల పరిశ్రమలను పరిశీలించామన్నారు. కార్యక్రమంలో సీఆర్‌టీలు సోమేష్, సూర్యం, దేవరాజ్, మోహన్, తులసీరావు, సత్యనారాయణ, గణేష్ పాల్గొన్నారు.

దళారులను ఆశ్రయించొద్దు

సోంపేట, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతులనుంచి ధాన్యం కొనుగోలు చేస్తుందని ఇందులో ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తహసీల్దార్ బి.అప్పలస్వామి, ఏవో బి.నరసింహమూర్తి తెలిపారు. మండలంలో 24 రైతు సేవా కేంద్రాల ద్వారా 2024 ఖరీఫ్ ధాన్యం 14,000 టన్నుల అంచన ఉండగా అందులో ఇప్పటివరకు 11,300 టన్నులు మాత్రమే సేకరించినట్టు తెలిపారు. కాబట్టి ప్రతీరైతు వద్ద ధాన్యం కొనుగోలు జరుగుతుందని తెలిపారు.

విజయవంతం చేయాలి

సోంపేట, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ప్రపంచ చిత్తడినేలల దినోత్సవం పురస్కరించుకొని సోంపేటలో ఆదివారం నిర్వహించే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పర్యావరణ పరిరక్షణ సమితి అధ్యక్షుడు వై.కృష్ణమూర్తి కోరారు. ఈ సందర్భంగా ఉదయం 10 గంటలకు స్థానిక కళానీ సంఘ భవనంలో సమావేశం నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు.

సొండి కులస్థులకు మద్యం దుకాణం

సోంపేట, జనవరి 31(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో సోంపేట మండలానికి సొండి కులస్థులకు మద్యం దుకాణం కేటాయించనున్నట్టు సీఐ కె.బేబీ తెలిపారు. ఆసక్తిగలవారు ఈ నెల 7వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ధర్మబద్ధంగా నడుచుకోవాలి

శ్రీకాకుళం కల్చరల్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ధర్మబద్ధంగా నడుచుకుంటే జీవితం ఆనందంగా ఉంటుందని రాజమండ్రికి చెందిన ప్రముఖ ఆధ్యాత్మికవేత్త విశ్వనాథ గోపాలకృష్ణ శాస్త్రి అన్నారు. శుక్రవారం నగరంలోని బాపూజీ కళామందిర్‌లో వేదాంత శ్రవణం అనే అంశంపై ఆయన ప్రవచనం చెప్పారు. మానవులందరూ సంస్కారవంతమైన జీవితం కలిగి ఉండాలని, భార్యభర్తలు మనస్పర్థలకు తావు లేకుండా జీవించాలన్నారు. చేసిన తప్పు వల్లే భయం ఏర్పడుతుందని, ప్రతి ప్రశ్నకు పరిష్కార మార్గం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా శంకరాచార్యుల చిత్రపటం వద్ద జ్యోతిప్రజ్వలన చేశారు. గుజరాతీపేటలో ఉన్న లలితా పీఠం అర్చకులు పెంట రామచంద్రశేఖర్ శర్మ, కార్తికేయ శర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపనిష్మందిరం అధ్యక్షులు గుమ్మా నగేష్‌తోపాటు ఎస్.నరసింహమూర్తి, జంధ్యాల శరత్‌బాబు, భాస్కర్‌భట్ల శ్రీరామశర్మ, పొట్నూరు వెంకట్రావు, పులఖండం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న ఆధ్యాత్మికవేత్త గోపాలకృష్ణ శాస్త్రి, హాజరైన ప్రజలు

7 నుంచి నాటిక పోటీలు



బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న సంఘ నాయకులు

ఆమదాలవలస, జనవరి 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఈ నెల 7, 8, 9 తేదీల్లో ఉభయ తెలుగు రాష్ట్రాల నాటిక పోటీలు నిర్వహించనున్నట్టు ఆమదాలవలస రంగస్థలం కళాకారుల సంఘ అధ్యక్షుడు, టీడీపీ రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి తమ్మినేని విద్యాసాగర్ తెలిపారు. శుక్రవారం పాలపోలమ్మ ఆలయ ఆవరణలో కార్యదర్శి పేడాడ వెంకట ప్రతాప్‌కుమార్ ఆధ్వర్యంలో నాటిక పోటీల బ్రోచర్లను ఆవిష్కరించారు. మూడు రోజులు నిర్వహించే ఈ నాటిక పోటీల్లో తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు కళాకారులు తమ ప్రదర్శనలు ఇవ్వనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పాత్రుని పాపారావు, సనపల అన్నాజీరావు, గొండు రవి, బొడ్డేపల్లి జనార్దనరావు, కాగితాపల్లి సంజీవరావు పాల్గొన్నారు.

ఆర్టీసీలో డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

అరసవల్లి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం ఆర్టీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణకు సంబంధించి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయకుమార్ తెలిపారు. 19వ బ్యాచ్‌కు సంబంధించి శిక్షణ కార్యక్రమాన్ని నేడు ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లైట్ వెహికల్ లైసెన్సు కలిగి, ఒక సంవత్సరం అనుభవం కలిగి, 21 ఏళ్ల నిండిన వారు ఈ శిక్షణకు అర్హులన్నారు. ఈ శిక్షణ 40 రోజుల పాటు ఉంటుందని, ఆసక్తి గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని, ఉపాధి అవకాశాలు మెరుగుపరచుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 80746 40792, 73829 23293 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలన్నారు.

పరిశ్రమలతో యువతకు ఉపాధి

సరుబుజ్జిలి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో పరిశ్రమలు ఏర్పాటు జరిగితే నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలుగు యువత మండల అధ్యక్షుడు తాడేల రాజారావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన తెలుగు యువత ఆధ్వర్యంలో పవర్ ప్లాంట్ ఏర్పాటుపై యువతతో చర్చించారు. సరుబుజ్జిలి, బూర్జ మండల సరిహద్దు ప్రాంతంలో ప్రభుత్వ రంగ సంస్థ జెన్‌కో ఆధ్వర్యంలో నిర్మించనున్న థర్మల్ పవర్‌ప్లాంట్‌తో రాజకీయ పార్టీలకు అతీతంగా యువతకి ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. టీడీపీ నాయకులు దవళ సింహాచలం, ఎండ రామారావు, దొరబాబు, కొమనాపల్లి రవవికుమార్, బసప ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో వర్సిటీ అధికారులు

ఎచ్చెర్ల, జనవరి 31(ఆంధ్రజ్యోతి): అలగప్పా యూనివర్సిటీ (తమిళనాడు)లో జరగనున్న ఆల్ ఇండియా అంతర్ వర్సిటీ బాల్ బ్యాడ్మింటన్ (పురుషులు, మహిళలు) పోటీల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ తరపున పాల్గొనే క్రీడాకారుల ఎంపిక వర్సిటీ ఆవరణలో శుక్రవారం జరిగింది. ఈ ఎంపిక ప్రక్రియలో వర్సిటీ అనుబంధ కళాశాలల నుంచి 35 మంది విద్యార్థిని, విద్యార్థులు పాల్గొనగా, 17 మందిని ఎంపిక చేశారు. సెలెక్టర్ పి.రాజ్‌కుమార్, బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధులు ఎం.మధు, కె.మోహన్, స్పోర్ట్స్ డీన్ డాక్టర్ పి.రవికుమార్, పీడీలు డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, డాక్టర్ ఎ.భాస్కర్ పర్యవేక్షణలో ఈ ఎంపిక ప్రక్రియ జరిగింది. ఈ పోటీలు ఈ ఏడాది మార్చి 29 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఎంపికైన క్రీడాకారులను వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత అభినందించారు.

సాగునీటి ప్రాజెక్టులకు నిధులు మంజూరు చేయండి



చంద్రబాబుకు సమస్య వివరిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

రణస్థలం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల నియోజకవర్గం పరిధిలో రైతులు ఎదుర్కొంటున్న సాగునీటి సమస్యను ముఖ్యమంత్రి చంద్రాబాబు దృష్టికి విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు తీసుకెళ్లారు. ఈ మేరకు గురువారం రాత్రి మర్యాదపూర్వకంగా అమరావతిలో కలిసి నియోజకవర్గం సమస్యలు వివరించారు. మద్దువలస, తోటపల్లి, నారాయణపురం కాలువల మరమ్మతులకు ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. బుడుమూరు చెరువును మినీ రిజర్వాయర్‌గా తీర్చిదిద్దితే లావేరు, ఎచ్చెర్ల, రణస్థలం మండల ప్రజలకు తాగు, సాగునీటి కష్టాలు తీరుతాయని వివరించారు. ఈ సందర్భంగా సమస్యలతో కూడిన వినత పత్రం అందజేశారు.

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోండి

ఇచ్ఛాపురం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): బాహుదానదిలో యథేచ్ఛగా ఇసుక అక్రమ తవ్వకాలు అడ్డుకోవాలని సీడాప్ మాజీ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్‌రెడ్డి అధికారులను కోరారు. శుక్రవారం నదిలో వంతెన పక్కనే జరుగుతున్న ఇసుక తవ్వకాలను అడ్డుకున్నారు. వంతెన పక్కనే తవ్వకాలు జరుపుతుండడంతో వంతెన మరింత బలహీనంగా మారే అవకాశం ఉన్నందున అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. వంతెన సమీపంలో పెద్ద పెద్ద గోతులు తవ్వి ఇసుక కుప్పలుగా పోసి అడ్డగోలుగా దోచుకుంటున్నారన్నారు.

నంది పురస్కారానికి ఎంపిక



జానికిరామ్

ఇచ్ఛాపురం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): తెలుగు సాహితీ, కళారంగంలో విశిష్ట సేవలు అందించిన పట్టణానికి చెందిన రంగాల జానికిరామ్ నంది పురస్కారానికి ఎంపికయ్యారు. కాళోజీ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, తెలుగు వెలుగు సాహితీ సంస్థ సంయుక్తంగా నిర్వహిస్తున్న స్వామి వివేకానంద జయంత్యుత్సవాల్లో భాగంగా ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్టు తెలుగు వెలుగు సాహితీ సంస్థ జాతీయ చైర్మన్ రాజ్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 2న విజయవాడలో నిర్వహించనున్న కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని జానికిరామ్ అందుకోనున్నారు.

ఇసుక తవ్వకాలు చేపడితే క్రిమినల్ కేసులు



నదికి వెళ్లే దారిలో గొయ్యి తీయించిన అధికారులు

ఇచ్ఛాపురం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): బాహుదానదిలో ఇసుక అక్రమ తవ్వకాలు చేపడితే క్రిమినల్ కేసులు నమోదుచేస్తామని తహసీల్దార్ ఎస్.వెంకటరావు హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం నదికి వెళ్లే మార్గాన్ని శుక్రవారం ఆయన పరిశీలించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ అక్రమదారులపై చర్యలు తీసుకుంటున్నామని, రాత్రి వేళల్లో ఇసుక తవ్వకాలు జరుపుతున్నట్టు గుర్తించామన్నారు. పూర్తిగా ఇసుక అక్రమ రవాణా నియంత్రించేందుకు బోర్డులు ఏర్పాటు చేయడంతోపాటు వాహనాల రాకపోకలను అడ్డుకునేందుకు మార్గంలో గోతులు తవ్వించినట్టు స్పష్టం చేశారు. ఇకపై పట్టుబడితే అపరాధ రుసుం విధించడంతోపాటు క్రిమినల్ కేసులు నమోదు చేసి వాహనాలను జప్తు చేస్తామని హెచ్చరించారు. ఈయన వెంట ఆర్ఐ కృష్ణ, సిబ్బంది ఉన్నారు.

డిగ్రీ విద్యార్థినిపై దాడి!

(మూడో పేజీ తరువాయి)

భావించి తల్లిదండ్రులకు రాత్రి సమాచారం అందించారు. తల్లిదండ్రులు హుటాహుటిన రిమ్స్‌కు చేరుకున్నారు. వారికి వార్డెన్ పూర్తి జరిగిన విషయాన్ని వివరించారు. వారు యువతి కన్ను, మోచేయి, గెడ్డం మీద కమిలిన గాయాలు చూసి ఆందోళన చెందారు. తమ కుమార్తెపై ఎవరో దాడి చేశారంటూ.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కూడా దాడి ఘటనగానే అనుమానిస్తున్నారు.

అనుమానాలెన్నో..?

వసతిగృహం నుంచి గురువారం మధ్యాహ్నం బయటకు వెళ్లిన లక్ష్మీ.. సాయంత్రం 6.30 గంటల సమయంలో జ్యోతి అనే విద్యార్థినికి ఫోన్ చేసి బ్యూటీపార్లర్‌కు వస్తావా?... అని అడిగింది. తాను రానని చెప్పడంతో ఫోన్ పెట్టేసింది. మళ్లీ 7.30 గంటలకు వసతిగృహంలో మరో విద్యార్థినికి ఫోన్ చేసి.. తాను భోజనానికి వస్తున్నానని చెప్పింది. రాత్రి 8 గంటలైనా లక్ష్మీ రాలేదు. ఫోన్ చేసినా స్పందించలేదు. అదే సమయంలో కొంతమంది విద్యార్థులు వస్తుండగా.. కళాశాల నుంచి వసతి గృహానికి వచ్చే మార్గంలో.. వాటర్ ట్యాంకు ఏర్పాటు చేసిన ఇరుకు సందులో లక్ష్మీ అచేతనంగా పడి ఉండడాన్ని గమనించారు. అక్కడ వాటర్ బాటిల్, లక్ష్మీ చెప్పులు, బ్యాగు పడి ఉండడంతో ఏదైనా గొడవ జరిగి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. శుక్రవారం కలెక్టర్‌తో పాటు, శ్రీకాకుళం డీఎస్పీ వివేకా నంద, సీఐ పైడపునాయుడు, ఎస్ఐ హరికృష్ణ సంఘటనా స్థలానికి చేరుకుని ఘటనపై ఆరా తీశారు. రిమ్స్‌లో చికిత్స పొందుతున్న లక్ష్మిని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శుక్రవారం పరామర్శించారు. ఆమెకు మెరుగైన వైద్యం అందించేందుకు విశాఖలోని మెడికవర్ ఆసుపత్రికి తరలించారు. దర్యాప్తు ముమ్మరం చేయాలని పోలీసులను కలెక్టర్ ఆదేశించారు. వసతి గృహంలో విద్యార్థులకు రక్షణ కల్పి స్తున్న తీరుపై కలెక్టర్ మండిపడ్డారు. కాగా కళాశాల క్యాంటీన్‌లో గల సీసీ కెమెరాల్లో లక్ష్మికి సంబంధించి కొన్ని దృశ్యాలు రికార్డు అయ్యాయి. రాత్రి 7-30 సమయంలో ఆ యు వతి సమీపంలో ఓ యువకుడు వెళ్తున్నట్లు సీసీ కెమెరాలో కనిపించింది. దీంతో ఆ యు వకుడే దాడి చేశాడా? అన్న కోణంలో పోలీ సులు విచారిస్తున్నారు. ప్రస్తుతం ఆ యువతి మాట్లాడలేని స్థితిలో ఉంది. సైగలు మాత్రమే చేస్తోంది.

నిందితులను అరెస్టు చేయాలి : మంత్రి అచ్చెన్నాయుడు

దాడి ఘటనపై వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పందించారు. జిల్లా కలెక్టర్, ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడారు. విద్యార్థినిపై దాడి ఘటనకు కారణమైన నిందితులను తక్షణమే అరెస్టు చేయాలని ఆదేశించారు. వసతిగృహం, కళాశాల సమీపంలో రక్షణ చర్యలు లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు.



ఘటనా స్థలంలో ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు

పర్యావరణ పరిరక్షణకే సైకిల్ యాత్ర

కవిటి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): దేశంలో రోజురోజుకీ చెట్లు లేక పర్యావరణానికి ముప్పువాటిల్లుతుందని, దీనిపై ప్రజలను చైతన్య పరిచేందుకు సైకిల్ యాత్ర చేపట్టినట్టు కోల్‌కతాకు చెందిన పరిమల్ కాంజీ (65) అన్నారు. కోల్‌కతాలో 20రోజుల కిందట సైకిల్ యాత్ర ప్రారంభించిన ఈయన శుక్రవారం మండల పరిధి జాతీయ రహదారిలోని కొజ్జిరియా, జాడుపూడి వద్ద స్థానికులతో మాట్లాడారు. చెట్లు లేకపోవడంతో సకాలంలో వర్షాలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రతీ గ్రామంలో మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని ప్రజలను కోరారు. తన సైకిల్ యాత్ర కన్యాకుమారి వరకు కొనసాగుతుందని, ఈ క్రమంలో గ్రామాల్లో మొక్కల పెంపకంపై అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు.



సైకిల్ యాత్ర చేస్తున్న కాంజీ

నేటి నుంచి ఆలయ వార్షికోత్సవం

గార, జనవరి 31(ఆంధ్రజ్యోతి): శాలిహుండం వద్ద గల ప్రసిద్ధ శ్వేతగిరిపై వెలసిన వీరవసంత ఈశ్వ రస్వామి వారి ఆలయ ప్రథమ వార్షికోత్సవం శని వారం నుంచి మూడు రోజుల పాటు వైభవంగా నిర్వహించను న్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేపట్టా రు. ఈ సందర్భంగా అ య్యప్ప, అభయాంజనేయ స్వామి దేవాలయాలను, కొండపైకి వెళ్లే మెట్ల మార్గాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

పశువైద్య కేంద్రానికి భవనం పరిశీలన

ఆమదాలవలస, జనవరి 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మెట్టక్కివలస ప్రాంతంలో పశువైద్య కేంద్రానికి పశువైద్యాధికారులు భవనం పరిశీలన చేశారు. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆదేశాలతో మెట్టక్కివలసలోని పలు భవనాలను టీడీపీ రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి తమ్మినేని విద్యాసాగర్ ఆధ్వర్యంలో పశువైద్యాధికారులు పరిశీలించారు. మెట్టక్కివలస దాని పరిసర ప్రాంతాల్లో ఉన్న పాడి రైతులు పడుతున్న ఇబ్బందులు ఎమ్మెల్యే రవికుమార్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యపై స్పందించిన రవికుమార్ పశు ఆరోగ్య కేంద్రాన్ని మెట్టక్కివలసలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరడంతో.. ఆ దిశగా అధికారులు శుక్రవారం పలు భవనాలను పరిశీలించారు. పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు రోణంకి ఆనందరావు, మున్సిపల్ ఆర్ఐ తమ్మినేని గోవిందరావు, టీడీపీ నాయకులు కొండబాబు, నాగళ్ల మురళీధర్, అచ్యుతరావు పాల్గొన్నారు.

వృద్ధుల సహాయకులకు శిక్షణపై హర్షం

శ్రీకాకుళం కల్చరల్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అనాథలైన వృద్ధులకు సేవ చేసేందుకు యువత, మహిళలకు శిక్షణ ఇవ్వడం అభినందనీయమని సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌జే రత్నాకర్ అన్నారు. శుక్రవారం బ్యాంకర్స్ కాలనీలో ఉన్న సత్యసాయి సేవా సమితి బృందావనంలో ఏర్పాటు చేసిన సత్యసాయి సిల్క్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎక్కడా లేనివిధంగా శ్రీకాకుళంలో వినూత్నంగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరావు, జిల్లా అధ్యక్షుడు రామచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం సందర్శన

కంచిలి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎలక్షన్‌కు సంబంధించిన పోలింగ్ కేంద్రాన్ని తాహశీల్దార్ ఎన్ రమేష్ పరిశీలించారు. శుక్రవారం కంచిలి జడ్‌పీహెచ్ కేంద్రాన్ని పరిశీలించిన అదికారులు పోలింగ్ సమయంలో ఓటర్లుకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకోవాలని అదికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వి తిరుమలరావు, ఎస్సై పి పారినాయుడు, వీఆర్‌ఓ శ్రీనువాసరావు పాల్గొన్నారు.

శ్యామలాంబ నవరాత్రి ఉత్సవాలు

శ్రీకాకుళం కల్చరల్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): నగరంలో మొండేటి వారి వీధిలోని లలితా దేవి శివ కామేశ్వరి ఆలయంలో శ్యామల నవరాత్రుల ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా తొమ్మిది రోజులపాటు నిర్వహించే ఈ ఉత్సవాల్లో తొమ్మిది రకాలుగా అలంకరణలు, విశేష పూజలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. తమలపాకులు, తులసి మాలలు, పసుపు కొమ్ములు, బిల్వ పత్రాలు, రకరకాల పూలతో అర్చనలు చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.

ఏర్పాట్ల పరిశీలన

జలుమూరు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): స్థానిక పీహెచ్‌సీలో శనివారం లెప్రసీ హెల్పింగ్ హ్యాండ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు డిప్యూటీ డీఎంహెచ్‌వో తాడేల శ్రీకాంత్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయాధికారి సన్యాసినాయుడు పాల్గొంటారన్నారు. దాతలు సాయంతో కుష్టువ్యాధిగ్రస్తులకు దుప్పట్లు, నిత్యావసర వస్తువులు పంపిణీ చేయడం జరుగుతుందిన్నారు. కార్యక్రమంలో డీపీఎంవో వాన సురేష్, ఆదిలింగం, డా. వంశీకృష్ణ, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడిని అధిగమిస్తేనే విజయం

పలాస రూరల్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఒత్తిడిని అధిగమించి పరీక్షల్లో విజయం సాధించాలని, దీనికోసం ప్రణాళికాబద్ధంగా చదవాలని డీఈవో తిరుమల చైతన్య అన్నారు. బ్రాహ్మణతర్లా జడ్పీ ఉన్నత పాఠశాలను శుక్రవారం సందర్శించారు.

డిగ్రీ కళాశాలలో ఓటరు నమోదు

ఇచ్ఛాపురం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో యంగ్ ఓటరు నమోదు కార్యక్రమం శుక్రవారం జరిగింది. 52 దరఖాస్తులను ఎన్ఎస్ఎస్ పీవో సంతోష్‌కుమార్ తహసీల్దార్‌కు అందించారు. మరో 38 దరఖాస్తులు ఐదు రోజుల్లో అందిస్తామని తెలియజేశారు.

దారీలేదు.. నీరూలేదు

- ఇలా ఉంటే నివసించేదెలా?
- ఆందోళన వ్యక్తంచేస్తున్న లబ్ధిదారులు
- ఇదీ సీతారాంపురం కాలనీ దుస్థితి

పాతపట్నం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో ఇళ్ల లేని వారికి కాలనీ కేటాయించగా లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపట్టినా ఆ కాలనీలో కనీస మౌలిక వసతుల కల్పనలో జగన్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించింది. కనీసం నడిచేందుకు రోడ్డు, తాగేందుకు నీరు లేదు. దీంతో ఎలా నివసించేదని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. జగనన్న కాలనీల్లో అన్ని సదుపాయాలు కల్పిస్తున్నామని అప్పటి ప్రభుత్వం ప్రచారం ఊదరగొట్టినా క్షేత్రస్థాయిలో ఆ ఛాయలు కనిపించలేదు. దీంతో ఇళ్ల లక్షలాది రూపాయల వ్యయంతో నిర్మాణం చేపట్టిన లబ్ధిదారులు రోడ్లు, కాలువలు, నీటి సదు పాయం లేక నివసించేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదీ సీతారాంపురం పంచాయతీలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీ దుస్థితి. వివరాలిలా ఉన్నాయి. సీతారాంపురం పంచాయతీ సీతారాంపురం, బోరుభద్ర, బూరగాం తదితర గ్రామాలకు చెందిన సుమారు 65 మందికి గృహాలు మంజూరయ్యాయి. వీటిలో సుమారు 28 ఇళ్లు పూర్తిగా నిర్మాణం పూర్తయ్యాయి. ఇళ్ల నిర్మాణ సమయంలోనూ ఇసుక, నీటికోసం ఇబ్బందులు పడ్డారు. కొండ సమీపంలో ఈ కాలనీని మంజూరు చేయడంతో వారు పడిన ఇక్కట్లు అన్నీ ఇన్నీ కావు. ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి ఇచ్చిన మొత్తం కనీసం పునాది తీసేందుకు చాలలేదని పలువురు లబ్ధిదారులు వాపోయారు. అయినా అప్పులు చేసి మరీ ఇళ్లు పూర్తి చేసినా ఇప్పటి వరకు రోడ్లు, కాలువల నిర్మించలేదని, నీటి సదుపాయం కల్పించలేదని వారు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ప్రస్తుతం రోడ్డు కోసం కేటాయించిన స్థలం మీదుగా కొండ పైనుంచి నీరు రావడంతో కోరుకుపోయి రాళ్లు తేలి కనీసం నడిచేందుకు కూడా వీలులేకుండా పోయిందని వారు వాపోతున్నారు. నీటి సదుపాయం కల్పించలేదని, దీంతో కొంత కాలంగా మిగిలిన ఇళ్ల నిర్మాణాలు నిలిచిపోయాయని పలువురు పేర్కొంటున్నారు. కనీస సదు పాయాలు కల్పించకుంటే నివసించేదెలా అని వారు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, ఉన్నతాధికారులు కాలనీలో సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.


సీతారాంపల్లిలో కాలనీలోకి వెళ్లేందుకు ఉన్న రోడ్డు ఇదే..


అసంపూర్తిగా ఉన్న గృహనిర్మాణాలు

నీటి సరఫరా ప్రభుత్వమే చేపట్టాలి



జగనన్న కాలనీకి తాగునీటి సదుపాయం కల్పించేందుకు కాలనీకి సుమారు 150 మీటర్ల దూరంలో బోరు వేయించాం. అయితే ఆ ప్రదేశం నుంచి కాలనీకి విద్యుత్ సరఫరా చేసేందుకు స్తంభాలు వేయాల్సి ఉంది. ఈ నిధులు పంచాయతీయే భరించాలని అధికారులంటున్నారు. పంచాయతీలో నిధులు లేవు. విద్యుత్, నీటి సదుపాయాలను ప్రభుత్వమే కల్పించాలి.

-కుమార్ రెడ్డి, సర్పంచ్, సీతారాంపురం

క్రైం కార్నర్

తండ్యాలపేట వద్ద కోడి పందేలు

- 11 మందిని పట్టుకున్న పోలీసులు

నరసన్నపేట, జనవరి 31(ఆంధ్రజ్యోతి): తండ్యాలపేట వద్ద నిర్వహిస్తున్న కోడి పందేల శిబిరంపై టాస్క్‌ఫోర్స్ బృందం శుక్రవారం దాడులు చేపట్టింది. ఈ మేరకు పందేలు ఆడుతున్న 11 మందిని పట్టుకుని పందెం కోళ్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీ సులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. తండ్యాలపేట గ్రామంలోని తోటల్లో గత కొన్నాళ్లుగా గుట్టుచప్పుడు కాకుండా కోడిపందేలను నిర్వహిస్తున్నారు. విషయం తెలుసుకున్న పోలీ సులు నిఘా పెట్టి ఉదయం కోడిపందేలు నిర్వహిస్తున్న సమయంలో ఒక్కసారిగా మెరుపుదాడి చేశారు. 11 మంది నిర్వాహకులు, ఆటగాళ్లతో పాటు కోడిపుంజులు, ఆరు మొబైల్ ఫోన్లు, రూ.36,286 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిర్వాహకులతో పాటు ఆడుతున్న వారిపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ దాలినాయుడు తెలిపారు.

ఐదు కేజీల గంజాయితో నలుగురి అరెస్ట్


మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసరావు

కోటబొమ్మాళి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): జర్జంగి సమీపంలోని సాయి శాన్విక దాబాలో శుక్రవారం గంజాయి సేవిస్తున్న నలుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి ఐదు కేజీలు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ కె.శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. కేరళ నుంచి ఒడిశా వెళ్లే ఒక ప్రైవేటు బస్సు ప్రతి మంగళ, శుక్రవారాల్లో ఇక్కడి దాబా వద్ద ఆగి సిబ్బంది, ప్రయాణికులు భోజనాలు చేస్తుంటారు. దాబా యజమాని సారవకోట మండలం జగన్నాథపురానికి చెందిన కొల్లి బాలరాజుతో పాటు సమీపంలో ఉన్న ఒక గ్రానైట్ పరిశ్రమ లో పనిచేస్తున్న రాజస్థాన్‌కు చెందిన మోహన్‌లాల్ జంగిడ్, ఒడిశాకు చెందిన బిరేస్వర్ బిస్వస్ గంజాయికి అలవాటు పడ్డారు. అయితే ఈ ప్రైవేటు బస్సులో పనిచేస్తున్న కేరళకు చెందిన శ్రీజిత్ విజయన్ దాబా యజమాని బాలరాజు అనుమతితో గంజాయి సేవిస్తుం డగా.. మాకు కూడా అలవాటు ఉందని, గంజాయి ఇవ్వాలని కోరడంతో సదరు వ్యక్తి ఒడిశా నుంచి గంజాయిని తీసుకువచ్చి దాబా యజమానికి ఇస్తుండేవాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం కూడా గంజాయిని తీసుకువచ్చి వారు సేవిస్తుండగా అందిన సమాచారం మేరకు ఎస్‌ఐ వి.సత్యనారాయణ సిబ్బందితో కలిసి శుక్రవారం తనిఖీ చేయగా నిందితులు పోలీసులను చూసి పారిపోయారు. అయితే జర్జంగి సమీపంలో ఫ్లైఓవర్ వద్ద నలుగురిని అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసి నిందితులను కోర్టులో హాజరుపరిచామని సీఐ తెలిపారు.

సర్వేయర్ ఆత్మహత్య


సింహాచలం (ఫైల్)

నరసన్నపేట, జనవరి 31(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా వంగరలో సర్వేయర్‌గా పనిచేస్తున్న ఎడిళ్ల అప్పల నర్సింహులు అలియాస్ సింహాచలం (53) శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. పట్టణంలో మారుతీనగర్-3లో సింహాచలం కుటుంబంతో కలిసి ఉంటున్నారు. శుక్రవారం ఇంట్లో తలుపులు వేసుకొని బెడ్ రూమ్‌లో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నారు. భార్య బనిశెట్టి సదు ణాంబ స్కూల్ నుంచి ఇంటికి వచ్చే సరికి భర్త ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఉండడంతో స్థానికుల సాయంతో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందారు. సింహాచలం భార్య కోటబొమ్మాళి మండలం లఖిందిడ్డి పాఠశాలలో ఉపాధ్యాయినిగా పనిచేస్తున్నారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. అయితే సింహాచలం ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ దుర్గా ప్రసాద్ తెలిపారు.

లారీ, బస్సు ఢీ.. తప్పిన ప్రమాదం

ఆమదాలవలస, జనవరి 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఫ్లై ఓవర్ దిగువ భాగంలో శుక్రవారం లారీ-బస్సు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఎటువంటి ప్రాణ నష్టం లేకపోవడంపై ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు. శ్రీకాకుళం వైపు నుంచి సంకిలి సుగర్ ఫ్యాక్టరీకి వెళ్తున్న చెరకు లోడు లారీ ఫ్లై ఓవర్ దిగువకు చేరుకుంది. ఇదే సమయంలో పట్టణంలో నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సు శ్రీకాకుళం వైపు వెళ్లేందుకు టర్నింగ్ తీసుకున్న సమయంలో చెరకు గెడలు బస్సు ముందు భాగానికి తగిలాయి. దీంతో ఇరు వాహనాల డ్రైవర్లు అప్రమత్తం కావడంతో రెండు వాహనాలను అక్కడే నిలిపివేశారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది. అయితే సుమారు 30 నిమిషాలపాటు రాకపోకలు స్తంభించిపోయాయి. దీంతో ఇరువైపులా వాహనాలు బారులుతీరాయి.

ఉత్తమ బోధనే లక్ష్యం

- సత్యసాయి సెంట్రల్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్


నూతన భవనాలను ప్రారంభ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న సత్యసాయి సెంట్రల్ కమిటీ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్

పలాసరూరల్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఉత్తమ విద్యాబోధనే సత్యసాయి సంస్థల లక్ష్యమని శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్ట్, ప్రశాంతి నిలయం మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ అన్నారు. రామకృష్ణాపురం సత్యసాయి విద్యావిహార్‌లో మొదటి అంతస్తు నూతన భవనాలను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సత్య సాయి విద్యావిహార్ ఆధ్వర్యంలో ఉత్తమ బోధన అందించడం జరుగుతోందని, దీనికి మరింత మెరుగులు దిద్ది విద్యాబోధనను పటిష్ఠం చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సత్యసాయి రాష్ట్ర ట్రస్టు కన్వీనర్ హెచ్‌జే దొర, ఎస్‌జీ చలం, సేవా సంస్థల ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు రఘుపాత్రుని లక్ష్మణరావు, జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, సత్యసాయి సంస్థల జిల్లా అధ్యక్షుడు సూర రామచంద్రరావు, ట్రస్టు చైర్మన్ మల్లా రామేశ్వరరావు, ప్రిన్సిపాల్ ప్రీతి చౌదరి తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి బీమా పరిహారం


చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

పోలాకి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): రాజారాంపురం గ్రామానికి చెందిన షైలపల్లి గురదేవి ఇటీవల రోడ్డుప్రమాదంలో మృతిచెందింది. ఈమెకు టీడీపీ సభ్యత్వం ఉండడంతో పార్టీ నుంచి రూ.2 లక్షలు బీమా మొత్తం మంజూరైంది. ఈ చెక్కును శుక్రవారం మబు గాంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మృతురాలి భర్త అప్పలరాజుకు అందించారు. కార్యక్రమంలో స్థానిక నేతలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆరుగురు ఫీల్డ్ అసిస్టెంట్ల సస్పెన్షన్

హరిపురం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మందస మండలంలో ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఆరుగురు ఫీల్డ్ అసిస్టెంట్లను ఏపీడీ శ్రీనివాసుల రెడ్డి సస్పెండ్ చేసినట్లు ఏపీవో హరికృష్ణ శుక్రవారం తెలిపారు. సామాజిక తనిఖీలో భారీ అవినీతి ఆరోపణలు రావడంతో మందసలో ఇటీవల నిర్వహించిన ప్రజావేదికలో ఆ వివరాలను బహిర్గతం చేశారు. ఈ నేపథ్యంలో 14మంది ఫీల్డ్ అసిస్టెంట్లపై ఏపీడీ విచారణ చేపట్టగా వీరిలో ఆరుగురిపై ఆరోపణలు నిర్ధారణ కావడంతో డ్వామా పీడీకి నివేదిక అందించారు. ఈ నేపథ్యంలో ఆయన ఆదేశాల మేరకు చీకటి రామారావు (రాంపల్లి), చెలియా లచ్చయ్య (సరియాపల్లి), తురక గణపతి (మందస), కృష్ణారావు (పొత్తంగి), నేతాజీ, దున్న ఉమాపతి (బేతాళ పురం)లపై సస్పెన్షన్ వేటు వేసినట్లు ఏపీవో తెలిపారు. ఈ ఉత్తర్వులు శుక్రవారం అందినట్లు పేర్కొన్నారు.

తూర్పుకాపు ఉద్యోగ విభాగం గౌరవాధ్యక్షుడిగా చిరంజీవి



పాతపట్నం, జనవరి31(ఆంధ్రజ్యోతి): ఏపీ తూర్పుకాపు సంక్షేమ సంఘం ఉద్యోగ విభాగ రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా పాతపట్నంకు చెందిన రిటైర్డ్ ఎంపీడీవో సలాన చిరంజీవి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన ఏపీటీకేఎస్ఎస్ రాష్ట్ర ఉద్యోగవిభాగ కోర్ కమిటీ సమావేశంలో ప్రకటించారు. ఈ సందర్భంగా చిరంజీవి నియామకంపై పలువురు ఉద్యోగ సంఘ నేతలు హర్షం వ్యక్తంచేశారు.

పిల్లలపై తల్లిదండ్రులు దృష్టి సారించాలి



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ న్యాయాధికారి ప్రసన్నలత

కోటబొమ్మాళి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): పిల్లలు చెడుమార్గాల్లో పయనించకుండా తల్లిదండ్రులు దృష్టి సారించాలని జూనియర్ సివిల్ న్యాయాధికారి బీఎంఆర్ ప్రసన్నలత అన్నారు. వీధి బాలలదినం సందర్భంగా శుక్రవారం స్థానిక కోర్టు ఆవరణలో న్యాయ వాదు లు, కక్షిదారులు, పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇలాంటి దినోత్సవం జరుపుకో వడం చాలా బాధాకరమని, వీధి బాలలు ఎక్కడైనా కనిపిస్తే 1098 నెంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు తిరుపతి, బి.నారాయణరావు, తిరుమలరావు, నరసింహమూర్తి, మన్మథరావు, వై. వెంకటరావు, పూజారి వాసుదే వరావు, కోటబొమ్మాళి, నౌపడ, సంతబొమ్మాళి, జలుమూరు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో సాగునీరందేలా చర్యలు

పలాస, జనవరి 31(ఆంధ్రజ్యోతి): కాలువల ద్వారా పూర్తి స్థాయిలో సాగునీరందేలా చర్యలు తీసుకునేందుకు సాగునీటి వినియోగదారుల సంఘం తీర్మానించింది. మునిసి పాలిటీ ఆరో వార్డు అంతరకుడ్డ గ్రామంలో నీటి సంఘం చైర్మన్ గొనప నిరంజన్ అధ్య క్షతన శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంతో ఆశతో రైతులు తమను ఎన్నుకున్నారని, వంశధార నీటితో పాటు చెరువుల్లోని నీటిని సక్రమంగా వినియోగించి పంటల దిగుబడికి కృషి చేస్తామన్నారు. 2018లో నీటి సంఘం ద్వారా చేసిన పనులకు ప్రభుత్వం నిధులు విడుదల చేసిందన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలను రెగ్యులరైజ్ చేయాలి

టెక్కలి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్తలను రెగ్యులరైజ్ చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ నాయకులు కోరారు. ఈ మేరకు అంగన్‌వాడీ కార్యకర్తలు రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు వినతిపత్రాలను పంపారు. సుప్రీంకోర్టు ఆదే శాల మేరకు అంగన్‌వాడీ కార్యకర్తలను ఆదుకొని బకాయిలతో పాటు గ్రాట్యుటీలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు బి.రమణమ్మ, చింతాడ ఇందిర, హేమావతి, ధనలక్ష్మి, లక్ష్మీకాంతం, సుమిత్ర తదితరులు పాల్గొన్నారు.

రేపు జిల్లాస్థాయి సాఫ్ట్ టెన్నిస్ క్రీడా జట్ల ఎంపికలు

పాతపట్నం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): జిల్లా సాఫ్ట్‌బాల్ టెన్నిస్ సబ్ జూనియర్ బాల బాలికల జట్ల ఎంపికలు ఆదివారం స్థానిక ఎన్టీఆర్ గ్రీన్ ఫీల్డ్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గురాడి అప్పన్న, షణ్ముఖరావు ఒక ప్రకటనలో తెలిపారు. 15 ఏళ్ల లోపు వయసు కలిగిన క్రీడాకారులు అర్హులని, ఆసక్తి ఉన్నవారు ఆదివారం ఉదయం 9గంటల్లోగా హాజరుకావాలన్నారు.

టెక్కలిలో కానరాని ఎన్నికల కోడ్..


ఇందిరాగాంధీ కూడలిలో ఇలా..

టెక్కలి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): డివిజన్ కేంద్రమైన టెక్కలిలో ఉత్తరాంధ్ర ఉపాధ్యా య ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కానరావడం లేదు. ఎన్నికల కోడ్ పక్కాగా అమలు చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రకటించినప్పటికీ స్థానిక అధికారులు ఇవేవీ పట్టించుకోవడం లేదు. నేతల విగ్రహాలకు మూత వేయడం, నాయకుల ఫ్లెక్సీలు తొలగించడం వంటివి చేపట్టలేదు. దీంతో స్థానికుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రతిష్ఠోత్సవాలు ప్రారంభం


టెక్కలి: శ్రీరామదీక్ష చేపట్టిన గ్రామస్థులతో స్వామి శ్రీనివాసానంద

టెక్కలి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): నర్సింగపల్లి గ్రామంలో శుక్రవారం రామాలయ ప్రతిష్ఠ మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. తొమ్మిది రోజుల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఫిబ్రవరి 7, 8, 9 తేదీల్లో ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠ తదితర కార్యక్రమాలు చేపట్టనున్నామన్నారు. ఇందులో భాగంగా తొలిరోజు శుక్రవారం గ్రామంలోని 100 కుటుంబాల వారు శ్రీరామదీక్ష చేపట్టారు. ఆనందాశ్రమం నిర్వాహకులు స్వామి శ్రీనివాసానంద పాల్గొని దీక్షాధారులకు ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ గ్రామాల్లో ఆధ్యాత్మికత పెంపొందించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రౌతు జయమోహన్, మాజీ సర్పంచ్ పోలాకి షణ్ముఖ రావు, నిర్వాహకులు దారపు చందనం, పొట్నూరు ఆనందరావు, దారపు రాము, రట్టి ఆదినారాయణ పాల్గొన్నారు.

కృష్ణరాయపురంలో..

నందిగాం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): బోరుభద్ర పంచాయతీ కృష్ణరాయపురంలో నూతనంగా నిర్మించిన వేపపోలమ్మతల్లి ఆలయ ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. పురోహితుడు తెలుకచర్ల ప్రసాదరావు శర్మ పర్యవే క్షణలో విశేష పూజలు చేశారు. మహిళలు కలశాలతో గ్రామ దేవత విగ్రహాన్ని ఊరేగింపు నిర్వహించారు. ఆదివారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ ఉంటుందన్నారు.

పాలవలసపేటలో..

పాలవలసపేట ఉద్దండభర్తుపురంలో అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠోత్స వాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. పురోహితులు సంతోష్‌కుమార్‌శర్మ, పార్థసారధి శర్మ నేతృత్వంలో గ్రామస్థులు ప్రత్యేక పూజలు నిర్వహించి విగ్రహాన్ని ఊరేగించారు.

కుమారుని వివాహానికి సీఎంకు ఎంజీఆర్ ఆహ్వానం



పాతపట్నం జనవరి31(ఆంధ్రజ్యోతి): తన కుమారుడు సాయిగణేష్ వివాహానికి హాజరుకావాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు సీఎం చంద్రబాబునాయుడును ఆహ్వానించారు. ఈ మేరకు శుక్రవారం విజయవాడలోని ఆయన స్వగృహంలో సాయిగణేష్‌తో కలిసి ఆహ్వాన పత్రికను అందించారు. అలాగే మంత్రులు నారా లోకేష్, కింజరాపు అచ్చెన్నా యుడులను కలిసి శుభలేఖలు అందించి ఆహ్వానించారు.

ఉపాధ్యాయినులకు సదుపాయాలు కల్పించాలి

కాశీబుగ్గ, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయి నులకు సదుపాయాలు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చందనరావు కోరారు. జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం పలాస మండలం, కాశీబుగ్గ పరిధిలోని చినబాడం పాఠశాలలను సందర్శించి ఉపాధ్యా యుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన యుడైస్ ప్లస్-2023-2024 ప్రకారం గతంలో పోలిస్తే ఉపాధ్యాయినుల సంఖ్య 53శాతానికి పెరిగినా వారు పనిచేస్తున్న చోట కనీస సౌకర్యాలు లేకపోవడం బాధాకరమన్నారు. షీ-బాక్స్‌లు ఏర్పాటు చేయాలని, మహిళలకు ప్రత్యేక మరుగుదొడ్లు, స్టాఫ్ రూమ్‌లు ఏర్పాటు చేయా లన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా సహాధ్యక్షుడు ఎస్.విష్ణుమూర్తి పాల్గొన్నారు.

ఉద్దానంలో 'ఎలుగుల' హల్‌చల్


నారాయణపురం వద్ద తోటలో ఎలుగు

హరిపురం, జనవరి31 (ఆంధ్రజ్యోతి): మందస మండలం ఉద్దానం ప్రాంతాలైన నారయణపురం, బాహాడపల్లి, అల్లిమెరక, అంబుగాం తదితర గ్రామాల్లో శుక్రవారం పట్టపగలే మూడు ఎలుగులు హల్‌చల్ చేశాయి. అల్లిమెరక వద్ద తోటల నుంచి గ్రామ సమీపంలోని రోడ్డు కల్వర్టు వద్దకు చేరుకోగా యువకులు చూసి వాటిని తరిమేందుకు ప్రయత్నించారు. రెండు ఎలుగులు వారిపై హుంకరించడంతో పాటు గ్రామ సమీపంలోకి చేరుకున్నాయి. దీంతో గ్రామస్థులంతా గుమిగూడి ఎలుగులను తరిమేయడంతో తోటల్లోకి వెళ్లిపోయాయి. జీడి చెట్లు పూతలు పూసి పిందెలు తొడుగుతున్న సమయంలో టీ దోమ నివారణకు మందులు పిచికారీ చేయాల్సి ఉందని, అయితే ఎలుగుల భయంతో పొలాలకు వెళ్లలేని పరిస్థితి ఎదురవుతోందని పలువురు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అటవీశాఖ అధికారులు స్పందించి ఎలుగుబంట్ల నుంచి రక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

చేసిన సేవలే గుర్తింపునిస్తాయి


రంగారావు దంపతులను సత్కరిస్తున్న పీరుకట్ల విఠల్

హరిపురం, జనవరి 31 (ఆంధ్ర జ్యోతి): విద్యార్థులకు, సమాజానికి చేసిన సేవలే ఉపాధ్యాయులకు గుర్తింపునిస్తాయని ఎంఈవో మత్రిపాటి లక్ష్మణరావు అన్నారు. అంబుగాం బొడ్డూరు ప్రాథమికోన్నత పాఠ శాల ఉపాధ్యాయుడు మజ్జి రంగారావు ఉద్యోగ విరమణ నేపథ్యంలో శుక్రవారం పాఠశాలలో రంగారావు, సావిత్రి దంపతులను సత్కరించారు. ఉపాధ్యాయుడిగా రంగారావు విద్యాభివృద్ధికి చేసిన సేవలతో మంచిపేరు సంపాదించుకున్నారన్నారు. కార్యక్రమంలో పీరుకట్ల విఠల్, కవిటి సూరిబాబు, బత్తిని లక్ష్మణ్, గేదెల నరేష్, దువ్వు వైకుంఠరావు, మధు, మార్పు చక్రధరరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరండి

టెక్కలి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): రానున్న విద్యా సంవత్సరానికి ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరాలని వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సతీష్‌కుమార్ కోరా రు. శుక్రవారం కళాశాల ఐక్యూ విభాగం ఆధ్వర్యంలో టెక్కలిలోని ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలలకు వెళ్లి విద్యార్థులకు కరపత్రాలిచ్చి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ లీలా పద్మజ, ఝాన్సీరాణి, సంతాన్ తదితరులు పాల్గొన్నారు. ● స్థానిక ప్రభు త్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ టి.గోవిందమ్మ, రామారావు, జనార్దన్ తది తరులు పాల్గొన్నారు.

బెండిగేటు ఫ్లైఓవర్‌పై వెలగని లైట్లు

వజ్రపుకొత్తూరు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): బెండిగేటు ఫ్లైఓవర్‌పై విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్నిరోజులుగా ఓవర్‌పై విద్యుత్ దీపాలు వెలగడం లేదు. నాలుగురోడ్ల కూడలి కావడంతో ఫ్లై ఓవర్ గుర్తించలేకపోతున్నామని దీంతో జంక్షన్ వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

న్యూస్ బాక్స్

6,361 పశువులకు వైద్య సేవలు

పాతపట్నం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ప్రాంతీయ పశువైద్య కేంద్రం పరిధిలో ఈనెల 20 నుంచి చేపట్టిన పశు వైద్య శిబిరాల్లో 6,361 పశువులకు వైద్య సేవలు అందించినట్లు ఏడీ డా.మంచు కరుణాకరరావు తెలిపారు. సరాళి గ్రామంలో నిర్వహించిన శిబిరాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన పరిధిలోని పాత పట్నం, మెళియాపుట్టి మండలాల్లో 44 వైద్య శిబిరాలను నిర్వహించామన్నారు. కార్యక్ర మంలో పశు వైద్యాధికారి అనిల్, చిన్నబాబు, బీమారావు, కల్పన, స్వరూప పాల్గొన్నారు.

శిబిరాలను వినియోగించుకోండి

పోలాకి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిర్వహిస్తున్న పశువైద్య శిబిరాలను రైతులు వినియోగించుకోవాలని పశు సంవర్థక శాఖ ఏడీ జి.ప్రసాదరావు, డీడీ పి.రామమోహన్‌రావు తెలిపారు. శుక్రవారం యాట్లబసివలసలో నిర్వహించిన మెగా పశువైద్యశిబి రాన్ని పరిశీలించారు. ఇప్పటి వరకు 1100 శిబిరాలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు చింతాడ షన్ముఖరావు, ఎస్.అనిల్ తదితరులు పాల్గొన్నారు.

రంజీలో రాణించిన విజయ్



టెక్కలి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): రాజస్థాన్‌లో జరుగుతున్న రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూప్-బి ఆఖరు క్రికెట్ మ్యాచ్‌లో ఆంధ్రా జట్టు రాజస్థాన్‌తో తలపడింది. ఆంధ్రా జట్టు తరఫున ఆడుతున్న టెక్కలికి చెందిన ఆఫ్ స్పిన్నర్ త్రిపురాన విజయ్ గురువారం జరిగిన మ్యాచ్ లో 62 పరుగులిచ్చి ఐదు వికెట్లు తీసుకొని ప్రతిభ కరిచాడు. ఇప్పటికే త్రిపురాన విజయ్ ముస్తాక్ అలీ టోర్నీ, కుచ్‌బీహార్ ట్రోఫీల్లో కూడా ఆంధ్రా తరఫున పాల్గొని రాణిం చాడు. తొమ్మిది ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌ల్లో 23 వికెట్లు తీయడం, 166 పరుగులు సాధించినట్లు తండ్రి కృష్ణంరాజు తెలిపాడు. ఇప్పటికే విజయ్ ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున ఐపీఎల్‌కు ఎంపికయ్యా డు. రంజీ ట్రోఫీలో రాణించిన విజయ్‌ని పలువురు క్రీడాకారులు అభినందించారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా బాలకృష్ణ

కొత్తూరు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల ధ్యక్షుడిగా చోడ వరపు బాలకృష్ణను నియమిస్తూ పార్టీ అధిష్ఠానం నియమించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి ఘన స్వాగతం

పాతపట్నం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా ఎస్.తేజేశ్వరరావు ఇటీవల బాధ్యతలు స్వీకరించి తొలిసారిగా గ్రామానికి రావడంతో శుక్రవారం పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. అనంతరం శ్రీనీలమణిదుర్గ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ఎన్నికల కోడ్ అమలు


నేతల విగ్రహాలకు వేసిన ముసుగులు

నందిగాం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు ప్రకటన వెలువడడంతో ఎన్నికల కోడ్ శుక్రవారం నుంచి అమలులోకి వచ్చింది. కలెక్టర్ ఆదేశాలు మేరకు తహసీల్దార్ పి.సోమేశ్వరరావు ఆధ్వర్యంలో నాయ కుల విగ్రహాలకు ముసుగులు తొడగడంతో పాటు ఫ్లెక్సీలు, పోస్టర్లు తొలగించారు.

ఫ్లెక్సీల తొలగింపు

నరసన్నపేట, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేయడంతో పట్టణంలో పార్టీల ఫ్లెక్సీలను పంచాయతీ అధికారులు తొలగించారు. ప్రభుత్వ కార్యాలయాలవద్ద ఉన్న ఫ్లెక్సీలు, బ్యానర్లను తీసి వేశారు. ఎన్నికల నిబంధనలు పాటించాలని ఎంపీడీవో మధుసూదనరావు సూచించారు.